నమస్తే తెలంగాణ

కరీంనగర్

8 | కరీంనగర్, ఆదివారం 1 జూన్ 2025 | KARIMNAGAR



### అన్యాయం జరుగుతుంది



మేం రోడ్డు వెడల్పునకు ఏమాత్రం వ్యతిరేకం కాదు. అయితే, మా డిమాండ్ ఏమిటంటే.. మార్కెట్‌కు ధరకు మూడింతల పరిహారం ఇవ్వాలని కోరుతున్నాం. అంతేకాదు.. చాలా మందిమి ఉపాధి కోల్పోతున్నాం. అధికారులు ఈ విషయంలో తప్పు దారిలో వెళ్తున్నారు. మా విజ్ఞప్తులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. పూర్తి స్థాయిలో మరోసారి అంచనాలు వేయడమేకాకుండా.. పరిహారం పెంచి ఇస్తే.. మాకు మేముగా స్వచ్ఛందంగా సహకరిస్తాం. కానీ, పరిహారం ఇవ్వకుండా, జీవోపాధి కల్పించకుండా అధికారులు ముందుకు వెళ్తున్న తీరు మాకు ఆందోళన కలిగిస్తుంది. తప్పని పరిస్థితుల్లో న్యాయం కోసం మా వంతు ప్రయత్నం చేయక తప్పదు.

- కొమ్మ శంకర్, బాధితుడు






వేములవాడ బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి

- వేములవాడలో రోడ్డు వెడల్పుపై ఆందోళన
- 15 రోజుల్లో ఖాళీ చేయాలంటూ నోటీసులు అతికించిన అధికారులు
- పరిహారం ఇవ్వకుండా ఎలా ఖాళీ చేస్తామంటున్న బాధితులు
- మార్కెట్ విలువకు మూడింతలు అదనంగా చెల్లించాలని డిమాండ్
- తమ అభ్యంతరాలు పట్టించుకోకుండానే నోటీసులు ఎలా ఇస్తారంటూ మండిపాటు
- ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసినా న్యాయం జరగలేదంటూ ఆవేదన
- పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్

# విస్తరణ.. వివాదం

**వేములవాడలో ప్రధాన రోడ్డు విస్తరణ అంశం వివాదమవుతోంది. బాధితుల అభిప్రాయాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండానే రోడ్డు విస్తరణ పనులకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్యంత విలువ గల దుకాణాలు, స్థలం పోవడంతోపాటు తాము జీవనోపాధి కోల్పోతున్నామని, ఈ నేపథ్యంలో మార్కెట్ విలువకు మూడింతల అధిక పరిహారం ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేస్తున్నా.. అధికారయంత్రాంగం ఎటువంటి స్పష్టతా ఇవ్వకుండానే విస్తరణకు ముందుకు వెళ్తున్నదన్న ఆవేదన వ్యక్తమవుతోంది. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, ఒప్పించి ముందుకు వెళ్లాలన్న డిమాండ్ వస్తుండగా.. అధికారులు ఎలా స్పందిస్తారోనన్న ఉత్కంఠ నెలకొంది.**

కరీంనగర్, మే 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా ప్రధాన రహదారి విస్తరణ చేయడానికి గత కొంత కాలంగా ప్రతిపాదనలు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే.. గత ప్రభుత్వాలు సైతం రహదారి విస్తరణ కోసం పలుమార్లు అంచనాలు వేయడం.. ఆ తదుపరి పలు కారణాలతో నిలిపివేసిన సందర్భాలున్నాయి. నిజానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా ప్రధాన రహదారిని విస్తరించడానికి చర్యలు తీసుకున్నది. కాగా, ప్రధాన రహదారి మొత్తం రోడ్డు భవనాల శాఖ పరిధిలో ఉండగా అప్పటి శాసన సభ్యుడు రమేశ్‌బాబు వేములవాడ ఆలయ ఏరియా అభివృద్ధి ప్రాధికార సంస్థలోకి మార్చారు. ఇప్పుడు ఇదే రోడ్డు విస్తరణ అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చింది. ఇందులో ప్రధాన రహదారి మూలవాగు నుంచి రాజన్న ఆలయం వరకు మొదటి దశ, అక్కడి నుంచి పోలీస్ స్టేషన్ వరకు రెండో దశలో 80 అడుగుల మేర విస్తరణ చేయాలని ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం రహదారి విస్తరణకు జీ2/77/2024 ద్వారా 06/09/2024న 243 నివాసాలు, దుకాణాలు విస్తరణలో ఎఫెక్ట్ అవుతున్నాయని పేర్కొంటూ ప్రైమరీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ తదుపరి వేములవాడ ఆర్డీవో అధ్యక్షతన నిర్వాసితులతో ఒక సమాశం జరిగిందని బాధితులు చెబుతున్నారు. అయితే, సమావేశం ప్రారంభానికి ముందే రిజిస్టర్‌లో అందరి సంతకాలు తీసుకున్నారని, వాటి ఆధారంగా చేసుకొని.. తాము అన్నింటికీ ఒప్పుకొన్నట్లుగా రాసుకున్నారని బాధితులు ప్రస్తుతం చెబుతున్నారు. సమావేశంలో తాము వ్యక్తం చేసిన పలు అభ్యంతరాలు ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదన్నది బాధితుల మాట. ఇది కొనసాగుతుండగానే.. 21/01/2025న ప్రధాన రహదారి భూ సేకరణపై రెండో నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో రోడ్డు విస్తరణకు సంబంధించి జరిపే భూ సేకరణలో తక్కువ మొత్తంలో వ్యవసాయేతర, వాణిజ్యపరమైన, నివాసాలు పోతున్నాయని, పూర్తిగా పోవడం లేదని, దీని ద్వారా ఏ వ్యక్తి కూడా జీవనోపాధి కోల్పోవడం లేదని, నిర్వాసితులు కావడం లేదని, కావున భూసేకరణ కింద పునరావాసం, ఉపాధి కల్పన వీరికి వర్తించదని సదరు నోటిఫికేషన్‌లో పేర్కొన్నది. దీనిని బాధితులు తప్పుబట్టారు. ఏళ్ల తరబడిగా తమ జీవనోపాధికి అండగా ఉన్న దుకాణాలు పోతున్నాయని, దాదాపు దుకాణాదారులతోపాటు వీటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు సుమారు 2 వేల పైచిలుకు వ్యక్తులు జీవనోపాధి కోల్పోతున్నారని పేర్కొంటూ.. అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నపాలు చేశారు. ఆధారాలతో లిఖిత పూర్వకంగా విన్నవించారు. వాస్తవాలను దాచి.. అధికారులు తప్పుడు నోటిఫికేషన్లు ఇచ్చారని పేర్కొన్నారు. విషయాలను ఆధారాలతో సహా వివరించడానికి వెళ్తే.. తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదంటూ.. గత కొద్ది కాలంగా దుకాణం దారులు పేర్కొంటూ వస్తున్నారు. అయితే, అధికారుల నుంచి సరైన స్పందన రాకపోవడంతో చాలా మంది కోర్టును ఆశ్రయించి స్టేటస్‌కో తెచ్చుకున్నారు. ఈ స్టేటస్‌కో.. జూన్ మొదటి వారం వరకు ఉంది. స్టేటస్ కో ఇచ్చినప్పటికీ అధికారులు వాటిని బేఖాతరు చేస్తూ కేవలం నలుగురికి మాత్రమే ఉన్నదని పేర్కొంటూ సర్వే అంచనాలను యథావిధిగా పూర్తి చేశారు.



గోడలకు అంటించిన నోటీసులు

#### 15 రోజుల్లో ఖాళీ చేయాలని నోటీసుల జారీ

ఒకవైపు కోర్టును ఆశ్రయించిన బాధితులు.. తాము రోడ్డు విస్తరణకు వ్యతిరేకం కాదని, అయితే.. తమకు సరైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఉన్న బహిరంగ మార్కెట్ విలువను పరిగణలోకి తీసుకొని.. దానికి మూడింతలు అదనంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఇదే విషయాన్ని ఇటు అధికారులకు, అటు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ, ఇవేవీ వినకుండానే సంబంధిత అధికారులు శనివారం దుకాణాలకు నోటీసులు అతికించారు. 15 రోజుల్లో ఖాళీ చేయాలంటూ సదరు నోటీసుల్లో స్పష్టం చేయడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. హైడ్రా తరహాలోనే తమను బెదిరిస్తున్నారని, అధికారులు తమ మొర ఇప్పటికైనా వినాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా.. పరిహారం, జీవనో పాధి విషయంలో తమకు ఎటువంటి అభయం ఇవ్వకుండానే.. తమపై జులుం చూపించడం ఏమిటన్న వాదనను వినిపిస్తున్నారు. మరోవైపు.. ప్రధాన రహదారి విస్తరణ అంచనా నివేదికలు పూర్తి తప్పుల తడకగా ఉన్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా కొలతలు సరిగా వేయలేదని, రెండంతస్తుల భవనం ఉంటే జీ ప్లస్ వన్‌గా చూపించారని. 24 గజాల స్థలం పోతుండగా కేవలం 12 గజాలుగా మాత్రమే చూపిస్తున్నారని, భవనాలను సరిగా అంచనా వేయడం లేదని, అందులోనూ నిర్వాసితుల పేర్లు తండ్రి చోట, భార్యది పడిందని, మరోచోట భర్తనే తండ్రిగా చూపుతూ అనేక తప్పుల తడకల నివేదిక రూపొందించారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని ఆధారాలతో చూపించేందుకు వెళితే.. అధికారులు తమను పట్టించుకోవడం లేదని 'నమస్తే తెలంగాణ'తో ఆవేదన వ్యక్తం చేశారు. తమ దుకాణాలు, స్థలాలు పట్టణ నడి ఒడ్డులో ఉన్నాయని, బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం చూస్తే గజానికి రూ.లక్ష వరకు ఉందని, దీనికి పరిహారం పెంచి ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తుంటే.. తమ మాట ఏమాత్రం వినకుండా గజానికి రూ.30 వేలు మాత్రమే ఇస్తామంటూ చెబుతున్నారని, అందులోనూ స్పష్టత లేదని బాధితులు పేర్కొంటున్నారు. అయితే, తాము రోడ్డు విస్తరణకు వ్యతిరేకం కాదని, దానికి ముందు తమ విన్నపాలు విని న్యాయం చేయాలని కోరుతున్నారు. అధికారయంత్రాంగం వినకపోతే.. తాము న్యాయస్థానాలను ఆశ్రయించక తప్పదని స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై వేములవాడ ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి వివరణ కోరేందుకు సంప్రదించగా స్పందించలేదు.

### న్యాయ పోరాటం చేస్తాం..



ఏళ్ల తరబడిగా ఈ దుకాణాలను నమ్ముకొని బతుకుతున్నాం. రోడ్డు విస్తరణలో జీవనాధారం మొత్తం పోతుంది. నాతోపాటు వందల కుటుంబాలు ఆధారం కోల్పోతున్నాయి. అయినా.. రోడ్డు విస్తరణను మేం వ్యతిరేకించడం లేదు. సహకరిస్తామని చెపుతున్నాం. అయితే, మార్కెట్ విలువపై మూడింతల పరిహారం అడుగుతున్నాం. అలాగే, జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయం చూపించమని కోరుతున్నాం. మా విన్నపాలను ఏమాత్రం వినకుండానే.. పదిహేను రోజుల్లో ఖాళీ చేయాలంటూ ఆఘమేఘాల మీద నోటీసులు అతికిస్తే.. మా కుటుంబాలు ఏం కావాలో అధికారులే చెప్పాలి. అందుకే.. మాకు న్యాయ పోరాటం తప్ప మరో మార్గం కనిపించడం లేదు.

- పొలాస రాజేశ్వర్

## చంద్రమౌళి కుటుంబాన్ని ఆదుకోవాలి

- పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలి
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



నివాళులర్పిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, మే 31: పని ఒత్తిడి, మానసిక వేదన, ఆర్థిక ఇబ్బందులతో గుండెపోటుతో మృతిచెందిన పంచాయతీ కార్యదర్శి ఎర్రోజు చంద్రమౌళి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. శనివారం జగిత్యాలలో చంద్రమౌళి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగిసి ఏడాదిన్నర గడిచిపోయిందని, అప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులు 24 గంటలు కష్టపడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం బడ్జెట్ ఇవ్వకుండా తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని ఒత్తిడి తెస్తుండడంతో సొంతంగా డబ్బులు ఖర్చు చేసి బిల్లుల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. చంద్రమౌళికి ప్రభుత్వం నుంచి దాదాపు రూ.4 లక్షల బిల్లులు రావాల్సి ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోవడంతో మనోవేదన చెందాడని, మరోవైపు పని ఒత్తిడి వల్ల గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిపారని వివరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి, రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పంచాయతీ బిల్లులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బీఆర్‌ఎస్ నాయకులు శీలం ప్రవీణ్, వెంకటేశ్వరరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.



రోడ్డు పక్క భవనాలను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

## ఎన్టీపీసీ మేడిపల్లి రోడ్డులో కూల్చివేతలు

జ్యోతినగర్, మే 31: ఎన్టీపీసీ మేడిపల్లిలో రోడ్డు వెడల్పులో భాగంగా శనివారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు కూల్చివేతలు చేపట్టారు. 80ఫీట్ల రోడ్డు వెడల్పులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా 40 ఫీట్ల చొప్పున మార్కింగ్ ప్రకారం అధికారులు జేసీబీ సాయంతో భవనాలను కూల్చివేశారు. మేడిపల్లి సెంటర్ నుంచి కూల్చివేత చర్యలను ప్రారంభించిన అధికారులు మొదటి రోజు రోడ్డును ఆనుకుని ఉన్న గద్దెలు, షెడ్లను జేసీబీతో తొలగించారు. అధికారులు ఏ మాత్రం సమయం ఇవ్వకుండా, హడావిడిగా కూల్చివేతలు చేపట్టడం ఏంటని పలువురు ఆరోపిస్తున్నారు.

#### కూల్చివేత తొందరపాటు చర్య

ఎన్టీపీసీ మేడిపల్లి రోడ్డులో మున్సిపల్ అధికారులు చేపట్టిన కూల్చివేతలు తొందరపాటు చర్యగా సీపీఎం నాయకులు నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి ఆరోపించా రు. శుక్రవారం మార్కింగ్ చేసిన అధికారులు, మరుసటి రోజే కూల్చివేత చర్యలు తీసుకోవడాన్ని ఖండించారు. కనీసం 15రోజుల గడువు ఇవ్వలేదన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం సరికాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోని నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు వెడల్పులో దుకాణాలను కోల్పోతున్న బాధిత వ్యాపారులను కలిసి వారి సమస్యను తెలుసుకున్నారు.

## సర్కారును మేల్కొలపాలి

కరీంనగర్ కలెక్టరేట్, మే 31: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని మేలుకొల్పాలని కోరుతూ శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి తెలంగాణ ఉద్యమకారులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 2న నిర్వహించే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారుల డిమాండ్లపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటివరకు మేనిఫెస్టోలో పొందుపర్చిన ఉద్యమకారుల హామీలు పరిశీలించకపోవడం శోచనీయమన్నారు. సోమవారం నాటి తన ప్రసంగంలో మేనిఫెస్టోలోని అంశాలపై ప్రభుత్వ వైఖరి వెల్లడించకపోతే అదే రోజు తమ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో టఫ్ నాయకులు జంగపల్లి కుమార్, ఉత్తర తెలంగాణ ప్రాంతం మహిళా కన్వీనర్ అయిల ప్రసన్న, మహిళా నాయకురాలు అంజలి, గౌరి, విజయ, భార్గవి, రాజేశ్వరి, తార, శంకర్, మున్నా, ఎల్లయ్య, విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.




ధ్వంసమైన జీపుల వద్ద బాధిత డ్రైవర్లు

## 'చింత మాను' పడి జీపులు ధ్వంసం

- రూ.10లక్షల వరకు నష్టం
- ఉపాధి కోల్పోయిన డ్రైవర్లు

ధర్మారం, మే 31: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం చింత చెట్టు మీద పడి రెండు జీపులు ధ్వంసమయ్యాయి. దీంతో సుమారు రూ.10లక్షల నష్టం వాటిల్లగా, తాము ఉపాధి కోల్పోయామని బాధిత డ్రైవర్లు వాపోయారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రతిరోజు జిల్లా కేంద్రానికి జీపులను నడుపుతూ డ్రైవర్లు ఉపాధి పొందుతుంటారు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే బొట్లవనపర్తి గ్రామానికి చెందిన రెడపాక లక్ష్మణ్, నంది మేడారం గ్రామానికి చెందిన మాదాసి తిరుపతి తమ జీపులను ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిలిపారు. దీంతో ఎన్నో ఏండ్ల నాటి చింత మానువృక్షం కూకటివేళ్ల సహా ఆకస్మాత్తుగా సదరు వాహనాలపై పడడంతో అవి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో జీపులలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. రోడ్డుపై వృక్షం పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జీపుల ధ్వంసంతో తాము ఉపాధి కోల్పోయామని, ఒక్కో వాహనానికి రూ.5లక్షల చొప్పున నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత డ్రైవర్లు లక్ష్మణ్, తిరుపతి కోరారు. మండల పరిషత్‌లో విప్ లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి, తమను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# బిల్లులు మోపెడు.. చెల్లించేదెన్నడు?



**ప్రభుత్వ కార్యాలయాల కరెంట్ బిల్లుల బకాయి పెరిగిపోతున్నది. గతంలో ఎన్నడూ లేనివిధంగా నెలనెలా గుట్టల్లా పేరుకుపోతున్నది. రెవెన్యూ శాఖ పరిధిలోని కార్యాలయాల నుంచి మొదలు కొని గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలకు సంబంధించిన పవర్ చార్జీల చెల్లింపు 20 నెలలుగా నిలిచిపోవడంతో లక్షలు దాటి కోట్లకు చేరిపోయింది. జగిత్యాల జిల్లాలో ఏకంగా రూ.182 కోట్లు పెండింగ్‌లో ఉండిపోగా, విద్యుత్ శాఖపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ప్రభుత్వం నిధులను మంజూరు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ప్రభుత్వ శాఖల సిబ్బంది చెబుతుండగా, ఎలాగైనా బిల్లుల చెల్లింపు జరిగేలా చూడాలని కలెక్టర్‌తో పాటు, సంబంధిత శాఖ అధికారులను ఎన్పీడీసీఎల్ వేడుకుంటున్నది.**

- కరెంట్ బిల్లు బకాయిలు రూ.182 కోట్లు
- 20 నెలలుగా చెల్లించని ప్రభుత్వ కార్యాలయాలు
- జగిత్యాల జిల్లాలో 7096 విద్యుత్ సర్వీసులు
- గతంలో నెలనెలా కట్టిన సర్కారు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో పెండింగ్
- ఎలాగైనా ఇప్పించాలని కలెక్టర్‌కు విద్యుత్ శాఖ అధికారుల విజ్ఞప్తి

జగిత్యాల, మే 31 (నమస్తే తెలంగాణ): జగిత్యాల జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు 7096 విద్యుత్ సర్వీసు కనెక్షన్లను ఎన్పీడీసీఎల్ శాఖ ఇచ్చింది. రెవెన్యూ శాఖ పరిధిలో 35 కనెక్షన్లు, అగ్రికల్చర్ మార్కెటింగ్ పరిధిలో 8 సర్వీసులు, రైతు వేదికలకు 70, సివిల్ హాస్పిటల్స్ 4, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 34, వైద్య విద్యాన పరిషత్‌లో 9, మెడికల్ కాలేజీ పరిధిలో 10 సర్వీసులు ఉన్నాయి. అలాగే నర్సింగ్ కాలేజీకి 2 కనెక్షన్లు, పోలీస్ స్టేషన్లకు సంబంధించి 36 కనెక్షన్లు, పోలీసు క్వార్టర్లకు సంబంధించి 220 సర్వీసులు ఉన్నాయి. గ్రామ పంచాయితీ వీధి దీపాలు, మంచినీటి సరఫరాకు సంబంధించి 5030 కనెక్షన్లు, మున్సిపల్ వీధి దీపాలు, మంచినీటి సరఫరాకు సంబంధించి 1173 సర్వీసులు, గ్రామ పంచాయితీలకు, 374, మండల పరిషత్ కార్యాలయాలకు 28 కనెక్షన్లు ఉన్నాయి. ఇరిగేషన్ శాఖ పరిధిలో 43, వాటర్ గ్రిడ్ పరిధిలో 18, కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో 2 కనెక్షన్లు ఉన్నాయి.

#### రూ.182.06 కోట్ల బకాయి


జిల్లా వ్యాప్తంగా సర్కారు కార్యాలయాలకు సంబంధించి రూ.182.06 కోట్ల బకాయిలు ఉన్నాయి. 35 రెవెన్యూ కార్యాలయాలు పదహారు నెలలుగా రూ.కోటీ 7లక్షల 29వేల కరెంట్ బిల్లు బకాయి పడ్డాయి. అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ రూ.1.31 లక్షలు, రైతు వేదికలు రూ.9.50 లక్షలు, సివిల్ హాస్పిటల్స్ రూ.కోటీ 35లక్షల 42వేలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రూ.36.34 లక్షలు, వైద్య విద్యాన పరిషత్ రూ.44.09 లక్షలు, మెడికల్ కాలేజీలు రూ.36.56 లక్షల బకాయిలున్నాయి. అలాగే, నర్సింగ్ కాలేజీ రూ.29.56 లక్షలు, పోలీస్ స్టేషన్లకు రూ.46.44 లక్షలు, పోలీసు క్వార్టర్లకు సంబంధించి రూ.81.41 లక్షల బకాయిలు ఉన్నాయి. గ్రామ పంచాయతీ వీధి దీపాలు, మంచినీటి సరఫరాకు సంబంధించి రూ.34కోట్ల 79లక్షల46వేల బకాయిలు పేరుకుపోయాయి. మున్సిపల్ వీధి దీపాలు, మంచినీటి సరఫరాకు సంబంధించి రూ.10కోట్ల5లక్షల 25వేలు బకాయి పడ్డాయి. గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సంబంధించి రూ.కోటీ 60లక్షల 62వేలు అప్పుపడ్డారు. మండల పరిషత్ కార్యాలయాలకు సంబంధించి రూ.15.69 లక్షలు, ఇరిగేషన్ శాఖ పరిధిలో రూ.44కోట్ల 36లక్షల 22వేలు బాకీ పడ్డారు. వాటర్ గ్రిడ్‌కి సంబంధించి రూ.32.28 కోట్లు బకాయిలున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి రూ.53.52 కోట్లు కరెంట్ బిల్లుల బకాయిలున్నాయి.

#### పల్లె, పట్టణ ప్రగతి నిధులు ఆగిపోవడంతో పెరిగిన బకాయిలు

పల్లె, పట్టణ ప్రగతి నిధులకు రాష్ట్ర ప్రభుత్వం మంగళం పలకడంతోనే గ్రామ పంచాయతీలకు సంబంధించిన కరెంట్ బిల్లుల బకాయిలు పెరిగిపోయాయని గ్రామ పంచాయితీ అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. గతంలో వచ్చిన నిధులు సక్రమంగా రాకపోవడం వల్లే తమకు చెల్లింపులు జరగడం లేదని విద్యుత్‌శాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అప్పటి సీఎం కేసీఆర్ పల్లె, పట్టణ ప్రగతి పేరిట కార్యక్రమాన్ని చేపట్టి గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు జనాభా ఆధారంగా నేరుగా నిధులు ఇస్తూ వచ్చారు. పల్లె, పట్టణ ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, కేంద్ర ప్రభుత్వం నుంచి సైతం 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరేవి. ఈ రెండు నిధులతో పాటు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల సాధారణ నిధులతో గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీల నిర్వహణ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగింది. వీధి దీపాలు, మంచినీటి సరఫరాకు సంబంధించిన కరెంట్ బిల్లులు ప్రతి నెలా క్లియర్ చేస్తూ వచ్చారు. ప్రస్తుతం కరెంట్ బిల్లులు సైతం చెల్లించలేని దైన్యం నెలకొంది. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు కలిపి దాదాపు రూ.45 కోట్ల బకాయి పడ్డాయి. ఈ విషయమై గ్రామ పంచాయితీ అధికారులు మాట్లాడుతూ, తాము ఏం చేయలేకపోతున్నామని, అసలు నిధులే లేవని, కనీసం ట్రాక్టర్లకు డీజిల్ ఖర్చులు సైతం చెల్లించే స్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ సమకూరే జనరల్ ఫండ్‌తో సిబ్బందికి జీతాలు ఇవ్వగలుగుతున్నామే కానీ, ఇతర అభివృద్ధి, పనులు, బకాయిల చెల్లింపులు చేయలేకపోతున్నామని చెబుతున్నారు.

#### ప్రభుత్వం మంజూరు చేస్తలేదు.. మేమేం చేయలేం

సార్. సర్కార్ బిల్లులు మంజూరు చేయడం లేదు. అందుకే కరెంట్ బిల్లులు చెల్లించలేకపోతున్నాం. మమ్మల్నేం చేయమంటారని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు పెద్ద మొత్తంలో కరెంట్ బిల్లులు బకాయి పడిన నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అన్ని కార్యాలయాలకు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఒక కీలక కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులు నోటీసు ఇస్తూ బిల్లులు చెల్లింపులు జరిగేలా చూడాలని రిక్వెస్ట్ చేశారు. ఈ సందర్భంలో కీలక శాఖ ఉద్యోగి మాట్లాడుతూ, 'సార్ ప్రతి నెలా కరెంట్ బిల్లులకు సంబంధించిన రిసీట్‌లు రాగానే బిల్లులు చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధుల చెల్లింపునకు అంగీకారం రావడం లేదు. బిల్లు మంజూరు కావడం లేదు. దాంతో ఏం చేయలేకపోతున్నామని' పేర్కొన్నారు. గతంలో ప్రతి నెలా బిల్లులు చేసి పంపగానే ప్రభుత్వం కరెంట్ బిల్లుల చెల్లింపునకు అనుమతితో పాటు, నిధులు ఇచ్చేదని, ఇప్పుడు అలా జరగడం లేదని సదరు ఉద్యోగి పేర్కొనడం గమనార్హం. ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 20 నెలలుగా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన విద్యుత్ బిల్లులు బకాయిలు పెట్టడం వల్ల విద్యుత్‌శాఖ తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటుందని ఎన్పీడీసీఎల్ అధికారులు అంతర్గత చర్చల్లో పేర్కొంటున్నారు. ఒక్క జగిత్యాల జిల్లాలోనే కాదు, రాష్ట్ర వ్యాప్యంగా అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని వారు పేర్కొంటున్నారు.



జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో బకాయి పడిన వివరాల కాపీ